# ఆపద్బాంధవుడు

– 'మాధవ్', Sharjah, UAE

"తాతయ్యా, తాతయ్యా ఆ పటంలో వున్నదెవరు?" నా మనవడు శంకరం ముద్దుమాటలకి పేపరు మడిచి పక్కనపెట్టి వాడిని ఒడిలోకి తీసుకున్నాను.
"ఎవరు కన్నా! ఎవరి ఫోటో గురించి అడుగుతున్నావు?"
'అదిగో! అదే! అక్కడవుండే అది." అంటూ వాడు వేలుపెట్టి చూపించాడు. నా మనసుకు తెలుసు అక్కడ వున్న ఫోటో ఎవరిదో అటువైపు చూడకుండానే చెప్పగలను అందులో వున్నదెవరో. నా మనసు లో తుళ్లిపడ్డ మాటలు అనుకోకుండానే పెదవిదాటి అస్పష్టంగా బైటపడ్డాయి. "ఆపద్బాంధవుడు..."
నేను అన్నపదానికి అర్థం ఆ పసిమనసుకు అర్థంకాలేదల్లేవుంది, ఆలోచిస్తున్నట్లు కొంచెంసేపు మొహం పెట్టి "అదేం పేరు?" అని అడిగాడు.
"వాడిపేరు శంకరం".

"భలేభలే నాపేరే పెట్టుకున్నాడూ..." అంటూ నా ఒడిలోంచి దూకి వేరే ఆటధ్యాసలో పడిపోయాడు.

నా మనసు ఆలోచనల్లో మునిగిపోయింది. శంకరం జ్ఞాపకాలు ఇవాల్టికీ సజీవంగా నా మనసులో నిండిపోయివున్నాయి. అవి కదలి అలలలాంటివి అలసిపోవు. ఒక్కొక్కసారి ఉప్పెనలాగా నన్ను ముంచెత్తేస్తుంటాయి.

శంకరం నాకు పరిచయమైన రోజు నాకు ఇవాల్టికీ జ్ఞాపకంవుంది. నిజానికి జ్ఞాపకముంచుకోదగ్గ గొప్ప సంఘటన ఆరోజు ఏమీ జరగలేదు. కానీ కొంతమంది వ్యక్తులు మనకు పరిచయమైన రోజులు మనకు జీవితాంతం గుర్తుండేలా తరువాతి సంఘటనలు చేస్తాయి. ఆరోజు నాకు యూనివర్సిటీ ఎడ్మిషను ఇంటర్వ్యూ. చాలా భయపడుతూ ప్రిన్సిపాల్‌గారి గదిముందర కూర్చునివున్నాను. నాప్రక్కనే గడ్డం పెరిగి ఏదో ధ్యాసలో పడినట్లుగా కూర్చునివున్నాడు శంకరం. తనంతట తానే పరిచయం చేసుకున్నాడు. సంభాషణలో తెలిసింది తను బి.ఎ. లో జాయినవడానికి వచ్చాడట. ఆ తర్వాత మేము కాలేజిలో జాయినయాము. మా క్లాసులు వేరవడంవల్ల తర్వాత దాదాపు మూడునెలలదాకా మళ్లీ ఒకరినొకరం కలుసుకోలేకపోయాము.

ఆ రోజు యూనివర్సిటీలో పాటలపోటీలు స్నేహితులందరూ బలవంతం చేయడంవల్ల నేనూ పోటీలో పాల్గొన్నాను. ప్రోగ్రామంతా అయిపోయిన తర్వాత తనంతట తనుగా వచ్చి "హలో! చాలా బాగా పాడారు" అనగానే నాకు మొదట ఒకక్షణం తనని ఎక్కడచూసానో జ్ఞాపకం రాలేదు. కానీ తర్వాత తనకు పాటలంటే ఎంత అభిమానమో చెప్పడంతో మాకు స్నేహితులమవడానికి ఒక విషయం దొరికింది. ఈ ప్రపంచంలో స్నేహం సహజంగా ఒక కారణంవల్ల ఏర్పడుతుంది. మధ్యలో ఆ కారణం రాలిపోవచ్చు కానీ అనుబంధం మాత్రం కొనసాగుతూనే వుంటుంది జీవితాంతమూ. ఆ తర్వాత మేమిద్దరమూ చాలా దగ్గరయాము. తర్వాత తెలిసింది శంకరం చాలాబాగా పాడతాడని, పైగా చక్కటి కవిగూడా అని. ఒకరోజు శంకరం కవితలు చదివి అడిగాను "శంకరం, ఇంతబాగా రాస్తావుగదా ఎందుకు వీటిని పబ్లిష్ చెయ్యవు? నీదగ్గరే దాచిపెట్టుకుంటే వీటికి గుర్తింపు ఎలావస్తుంది" కానీ శంకరం దానికి సమాధానం చెప్పలేదు నవ్వేసి ఊరుకున్నాడు. శంకరం చాలా స్నేహశీలి ఐతే చాలా గుట్టుమనిషిగూడా... ఇలా ఎందుకంటున్నానో కారణం ముందుముందు మీకే తెలుస్తుంది. ఎదుటివ్యక్తి బాధలో వున్నాడు అంటే తట్టుకోలేని సున్నితపు మనస్తత్వం శంకరానిది.

ఒకరోజు కాలేజీలో రౌడీలాగా తిరిగే అవధాన్లు ఎవరో ఆడపిల్లను రాగ్ చేసాడట. అంతే శంకరం వెళ్లి వాడితో కలబడ్డాడు. చాలా ఆవేశపరుడేగానీ శారీరకంగా చాలా బలహీనుడు అందుకే పాపం అవధాన్లువాళ్లచేతిలో దెబ్బతినటం మొదలుపెట్టాడు. ఈ విషయం నాకు ఎవరో చెప్పగానే పరిగెత్తుకు వెళ్లి వాళ్లనుంచి శంకరాన్ని విడదీసాను. అవధాన్లు శంకరాన్ని అలా కొట్టడం నాకు నచ్చలేదు అందుకే వాళ్లమీద తిరగబడి నాలుగు దెబ్బలుకొట్టాను. చిన్నప్పట్నించీ చెరువుల్లో ఈతలుకొడుతూ గొడ్లకాపర్లతో కుస్తీలుపడుతూ పల్లెటూర్లలో పెరిగినవాడిని అవధాన్లునీ వాడి స్నేహితులనీ మట్టికరిపించడం పెద్ద కష్టమేమీ కాలేదు. కానీ ఈ విషయం ఎలాగో మా ప్రిన్సిపాల్ గారికి తెలిసిపోయింది. శంకరాన్నీ నన్నూ తన రూమ్‌లోకి పిలిచి "కాలేజీలో ఏదైనా అన్యాయం జరిగితే తనవద్దకు కంప్లయింటు తేవాలిగానీ దొమ్మిలకి పోగూడదంటూ" చీవాట్లుపెట్టారు. ఎలాగో ఈ విషయం కాలేజీ అంతా తెలిసిపోయింది. నిజానికి శంకరమూ నేనూ ప్రాణ స్నేహితులమని కాలేజీ అంతా అనుకుంటారుగానీ మేమెప్పుడూ పర్సనల్ విషయాలు మాట్లాడుకొనేవాళ్లంకాదు. ఎంతసేపూ కవితలూ, పాటలూ తప్పనించి మేము మిగిలినవిషయాలు అసలు ఆలోచించేవాళ్లమేగాదు.

ఒక రోజున కాలేజిలో అవధాన్లు నన్ను ఒక్కడినే కలుసుకోవాలంటూ కబురుపెట్టాడు. రాజీ పడటానికేమో అనుకుని ఎలాగూ నాకూ శత్రుత్వం నడపడం ఇష్టంలేదు కాబట్టి వెళ్లాను. కానీ, నన్ను అక్కడికి పిలవడంలో అవధాన్లు ఉద్దేశ్యం వేరు. "నీకు శంకరం స్నేహితుడని నాకు తెలుసు కానీ నాకు నువ్వంటే చాలా అభిమానం. అందుకే నీ మంచికోరి చెబుతున్నాను శంకరంతో కలిసి తిరగడం మంచిది కాదు నన్ను అర్థంచేసుకో..." అవధాన్లు శంకరం గురించి అలా చెప్పడం నాకు కోపాన్ని తెప్పించింది కానీ అవధాన్లు ఆ తర్వాత చెప్పిన మాటలు నాలో ఆశ్చర్యాన్ని కలిగించాయి. "శంకరం కారెక్టరు అంత మంచిది కాదు. నీకు తెలీదేమో ఎప్పుడూ అప్పులు చేస్తూంటాడు. కావాలంటే చూడు ఎప్పుడూ హాస్పిటల్ చుట్టూతా తిరుగుతూంటాడు. ఏం రోగాలో పాడో..." అవధాన్లు అలామాట్లాడుతూనే వున్నాడు నేను లేచి వచ్చేసాను. కానీ, నా మనసులో శంకరంగురించి ఒక అనుమానం బయల్దేరింది.

ఆ మర్నాటిరోజు శంకరం హడావుడిగా వచ్చి "గురూ! అర్జంటుగా కావాలి ఒక 200వుంటే ఇయ్యి" అని అడిగాడు. అప్పుడు నా దగ్గర మనీ వుంది కానీ నాకు అవధాన్లు చెప్పిన మాటలు గుర్తువచ్చాయి. లేవని చెప్పేసాను. ఆ సమాధానం ఊహించినట్లేవుంది "బాడ్‌లక్, నెవర్ మైండ్. ఇంకెవరిదగ్గరైనా సంపాదిస్తాను." అంటూ వెళ్లిపోయాడు. శంకరం ఎందుకు మనీ అడిగాడో నాకు అర్థంకాకుండానే పోయింది. మళ్లీ శంకరం నాకు దాదాపు వారంరోజులదాకా కనబడలేదు. తర్వాత కలవగానే అడిగాను "ఏరా! ఈ వారంరోజులూ ఎక్కడికివెళ్లావు?" అడిగాను.
"అర్జంటు పనిమీద మా ఊరువెళ్లాను"

"ఏంటి విషయం?"
"ఆ ఏదో మామూలు విషయాలే!" శంకరం మాటదాటెయ్యడం నాకు స్పష్టంగా కనిపించింది. ఎందుకో తెలియదు శంకరానికి నేను ఎంత దగ్గరగా వుందామని ప్రయత్నిస్తానో కొన్నికొన్ని సందర్భాల్లో వాడు ఎవరో నాకు తెలియనట్లుగానే, ఒక అపరిచితవ్యక్తితో మాట్లాడుతున్నట్లుగానే అనిపించేట్లుచేస్తాడు. ఆ రోజు సాయంత్రం అవధాన్లు గేమ్సురూమ్ దగ్గర కలిసాడు.

"శంకరం వారంరోజులు ఎక్కడికెళ్లాడో నీకేమైనా చెప్పాడా?"
అవధాన్లు అలా అడగడం నాకు చిరాకు కలిగించింది.
"ఆ! ఏదో అర్జంటు పనిపడితే వాళ్లఊరు వెళ్లాడట"
"ఎంత అమాయకుడివి గురూ! నువ్వేమో శంకరం నీ ఫ్రెండంటూ లేగ పూసుకు తిరుగులుతుంటావు. వాడేమో నీకు అబద్ధాలు చెపుతూం టాడు..."
అంటూ నవ్వసాగాడు.
"ఇందులో అబద్ధమేముంది అవధాన్లూ?" అడిగాను.
"ఈ వారంరోజులూ శంకరం గవర్నమెంటు హాస్పటల్‌లో వున్నాడు. మన రాజువాళ్ల తమ్ముడికి ఒంట్లో బాగోకపోతే హాస్పటల్‌కివెళ్లాడు అక్కడ ఇన్‌పేషంట్‌గా బెడ్‌మీద వున్నాడట. పైగా తనని అక్కడ చూసినవిషయం ఎవరితోనూ చెప్పద్దని చెప్పాడట..." ఈ మాట విన డంతో నా మనసంతా చేదుగా అయిపోయింది. శంకరం నాతో అబద్ధం చెప్పాడన్న విషయం నన్ను చాలా బాధకి గురిచేసింది. శంక రాన్ని అప్పటికప్పుడు నిలదీసి అడిగెయ్యాలనిపించింది.

కానీ, "శంకరం నా స్నేహితుడు అనుకుంటూ నేనేదో పొంగిపోవడమే గానీ వాడెప్పుడూ నాతో పర్సనల్‌గా మాట్లాడిందిలేదు. నాదగ్గర్నించి అన్నీ దాచేవాడితో నేనెందుకు స్నేహం చెయ్యాలి? అసలు వాడిని అడిగి అనవసరంగా బాధపడేకంటే వాడితో మాట్లాడకపోవడమే మంచిది." అనుకుని ఆ రోజునుంచీ శంకరంతో మాట్లాడటం మాని య్యదలుచుకున్నాను.

కొంతమంది గురించి కొన్నికొన్ని విషయాలు విన్నప్పుడు నిజమెంతో అబద్ధమెంతో విచారించకుండా మనం ఆ వ్యక్తితో మాట్లాడాలో వద్దో అనే నిర్ణయం తీసేసుకుంటాము. ఆ క్షణంలో మనం తీసుకున్న నిర్ణయం మనకు సరైనదే నవిపిస్తుంది. కానీ, మనం దూరం చేసిన వ్యక్తి మనకెంత దగ్గరకావాలనుకున్నాడో, మనమంచి ఎంత ఆత్మీయత ఆప్యాయత కోరుకున్నాడో మనకి తెలిస్తే మనం ఎంత బాధపడతామూ... ప్రతివ్యక్తికీ వాడివాడి బాధలుంటాయి. ఆ ఆవేదన లనూ బాధలనూ పంచుకొనే తోడుకోసం ప్రతివ్యక్తీ వెతుకుతూనే వుంటాడు. కానీ ఆ ప్రయత్నంలో భంగపడుతూనేవుంటాడు. నిజానికి, శంకరం నాకు దగ్గరవాలనుకున్నాడు. నాతో చాలా స్నేహంగా తిరిగాడు కానీ బహుశా శంకరం ఆశించినంత ఆప్యాయత నేను అందించలేకపోయానేమో! లేకపోతే తనబాధలను నాతో పంచు కొనే ప్రయత్నం ఎందుకుచెయ్యలేకపోయాడు? ఈ ప్రశ్నకు సమా ధానం నాకు తెలియకుండానే పోయింది. కానీ, నేను తీసుకున్న నిర్ణ యంవల్ల శంకరం మనసు తీవ్రంగా గాయపడిందని మాత్రం అర్థం చేసుకోలేకపోయాను. పశ్చాత్తాపం అనేది మంచిదే కానీ చెయ్యవలసిన పని చెయ్యవలసినసమయంలో చెయ్యకపోతే పశ్చాత్తాపపడ్డా ఏం ప్రయోజనం?

ఆ తర్వాత చాలారోజులు శంకరంతో మాట్లాడలేదు. శంకరం నా ప్రవర్తనలో తేడా పసిగట్టాడు కానీ పట్టనట్లే ఇంతకు ముందరలాగానే నాతో స్నేహంగా వుండటానికే ప్రయత్నం చేసాడు. కానీ నేను మాత్రం శంకరంతో ముభావంగానే వుండటం మొదలుపెట్టాను.

మా కాలేజీ ఎగ్జామినేషన్ డేట్స్ ఎనౌన్సు చేసారు. అందరినీ ఎగ్జామినే షన్ ఫీజు కట్టమంటూ నోటీసులు ఇచ్చారు. నేను ఒక రైతు కుటుం బంలో పుట్టాను ఒక్కొక్కసారికి డబ్బులకు చాలా ఇబ్బంది అవుతూం టుంది. అలాగే, సమయానికి మా ఇంటినుండి డబ్బురానందువల్ల నేను ఫీజు కట్టలేకపోయాను. ఎగ్జామినేషన్ ఫీజు కట్టండంటూ ఫైనల్ నోటీసు ఇచ్చారు అందులో డబ్బుకట్టనివాళ్ల లిస్ట్ ఇచ్చారు. నాపేరు గూడా అందులో వుంది. చాలా దిగులుగా మా హాస్టల్ గార్డెన్‌లో కూర్చునివున్నాను. నన్ను వెతుక్కుంటూ శంకరం అక్కడికి వచ్చాడు. "ఏరా! ఎగ్జామినేషన్ ఫీజు ఎందుకు కట్టలేదు? నీకు డబ్బు అవసరమైతే నాతో చెప్పచ్చుగదా?" అంటూ తన జేబులోంచి 500 తీసి నాచేతిలో పెట్టాడు. శంకరం అలా డబ్బు ఇవ్వడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిం చింది. కానీ ఆ క్షణంలో ఎవరు డబ్బు ఇచ్చినా కాదనే స్థితిలో నేను లేను. "శంకరం! నీ ఋణం ఎలా తీర్చుకోగలను" దగ్గరుస్వరంతో అన్నాను.
"ఋణంతీర్చుకొనే టైమొచ్చినప్పుడు అడిగి వడ్డీతో సహా తిరిగి తీసు కుంటాము గానీ నువ్వు వెళ్లి ముందర ఫీజు కట్టిరా." అనడంతో ఫీజు కట్టడానికి వెళ్లిపోయాను. తర్వాత శంకరం నా కంటికి కనబడనేలేదు. మా పరీక్షలు దగ్గరపడటంవల్ల నేను చదువులో పడిపోయాను. ఎగ్జా మినేషన్స్ అవగానే శెలవలు రావడంతో మా ఊరు వెళ్లిపోయాను. దాదాపు 5 నెలల తర్వాత కాలేజీ రీ ఓపెనింగ్‌కి వెళ్లాను. మా ఎగ్జామినే షన్ రిజల్ట్సు బోర్డులో వేసారు. నేను అక్కడికి వెళ్లేసరికి అక్కడ చాలామంది వున్నారు. వాళ్లమధ్యలోంచి అవధాన్లు బైటికివచ్చి నన్ను చూడగానే "కంగ్రాట్యులేషన్స్ నువ్వు పాసయావు" అని చెప్పడం చాలా సంతోషాన్ని కలిగించింది. కానీ, నా కళ్లు శంకరం కోసం వెతక సాగాయి. శంకరం వాళ్ల ఇల్లెక్కడో నాకు తెలియకపోవడంతో ఈ 5 నెలలూ శంకరం ఎక్కడవున్నాడో ఎలావున్నాడో తెలుసుకొనే అవకా శంకూడా దొరక్కుండా పోయింది. కనీసం వాడి బాకీగూడా తీర్చడా నికి వాడు కనబడలేదు. సమయానికి అవధాన్లు కనబడటంతో వాడినే అడిగాను
"అవధాన్లూ! మన శంకరం నీకేమైనా కనబడ్డాడా?" నేను ఇలా అడగ డంతో అవధాన్లు ముఖంలో రంగులు మారిపోయాయి.
"అయితే నీకీ విషయం తెలియదా!" చాలా ఆశ్చర్యంగా మొహంపెట్టి అడిగాడు. "ఏ విషయం?" నా మనసులో ఆదుర్దా మొదలయింది.
"సారీగురూ! శంకరం చనిపోయి దాదాపు 3 నెలలయింది. నేనింకా నీకు ఈ విషయం తెలుసేమో నమకున్నాను." మొదట నేను వింటు న్నది నిజమో అబద్ధమో తెలియకుండా పోయింది. నా కాళ్లు పట్టుత ప్పుతున్నట్లుగా అయింది. అవధాన్లు నన్ను పడిపోకుండా పట్టి ఆపి కూర్చోపెట్టి కాసిని మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడు. "ఎలా జరిగింది?" కొంచెం తేరుకుని అడిగాను.
"నేను శంకరాన్ని చాలా అపార్థంచేసుకున్నాను. వాడు హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూంటే జల్సాపురుషుడేమో నమకున్నాను తప్పితే ఇలా వాడు బ్లడ్‌కాన్సర్‌తోటి బాధపడుతున్నాడని నాకు తెలియదు." అవధాన్లు తప్పుచేసినవాడిలాగా చిన్నపిల్లాడిలాగా ఏడవసాగాడు.

"శంకరానికి కాన్సరా?" నానోట మాటరాలేదు. "మరి ఈ విషయం నాకు వాడెందుకు చెప్పలేదు..." అడిగాను. "అసలు వాడు చాలా గుట్టు మనిషి. వాడిబాధ ఎవడితోటీ చెప్పేవాడుకాదు. ఏదో చాలా దిలాసాగా బ్రతికేస్తున్నట్లు తిరిగేవాడు" అంటూ చెబుతున్న అవధాన్లుని ఆపి...
"అవధాన్లూ, నీకు శంకరం వాళ్ల ఇల్లు తెలుసా"
"ఆ తెలుసు వాడు పోయినప్పుడు వెళ్లాను"
అవధాన్లుని తీసుకుని శంకరం వాళ్ల ఇంటికే వెళ్లాను. అది ఒక చిన్న పెంకుటిల్లు కాలేజీకి దాదాపు 4 ఫర్లాంగుల దూరంలో వుంది. నేను వెళ్లగానే అక్కడే ఒక మంచంలో కూర్చునివున్న వాళ్ల అమ్మగారిని చూసాను. అప్పటికే దారిలో నాకు అవధాన్లు శంకరంగురించి అంతా చెప్పాడు. కానీ, ఆ విషయాలలో ఒక్కటిగూడా శంకరం నాకు దగ్గరగా తిరిగినరోజులలో తెలియలేదు. శంకరం బ్రతికేవుంటే బహుశా అవ ధాన్లుకుగూడా తెలిసివచ్చేదికాదేమో!

శంకరం చాలా బీద కుటుంబంలోనుంచి వచ్చాడట. వాళ్ల నాన్న చిన్నప్పుడే పోవడంతో వాళ్ల కుటుంబం దిక్కులేనిదయిపోయింది. బంధువులు అనాదరణచేయడంతో రోజు గడవడం కష్టమయిపోయి వాళ్ల అమ్మగారు కూలిపని చేసి వీడిని పెద్దచేసింది. శంకరం పగలు కాలేజీలో చదువుకుంటూ రాత్రిపూట కొట్లలో ఎకౌంట్లు రాసిపెట్టేవా డట. పైగా వాళ్ల అమ్మగారు ఉబ్బసం పేషంట్ అవడంతో ఆవిడ మం దులకోసం విపరీతంగా డబ్బు ఖర్చుపెట్టేవాడు. దానికోసమే

హాస్పిటల్స్ చుట్టూతా తిరిగేవాడట.

మేము శంకరం వాళ్ల ఇంటికి వెళ్లగానే వాళ్ల అమ్మగారు కలిశారు. నేను శంకరం స్నేహితుడినని నా పేరు చెప్పగానే ఆవిడ భోరున ఏడవడం మొదలుపెట్టారు. "నాయనా! నీవొక్కడివే వాడికి స్నేహితుడివని చెప్పేవాడు. పాపిష్టిరోగం నాకు రాగూడదూ, మాయదారిరోగం చెట్టంత నాకొడుకును పొట్టనబెట్టుకుంది" అంటూ ఆవిడ పడుతున్న ఆవేదన చూసి నాకు కళ్లవెంట నీరు ఆగలేదు. ఆవిడను సముదాయించడం మొదలు పెట్టాను. కానీ నా మనసంతా మొద్దుబారినట్లుగానే వుంది. శంకరం ఇక ఈ భూమిమీద లేడన్న విషయం నాకెందుకో నమ్మబుద్ధవడంలేదు. "నాయనా, నువ్వు ఎప్పటికయినా వస్తావంటూ నీ పేరున ఒక ఉత్తరం రాసిపెట్టాడు. అవధాన్లుతో చెప్పానుగానీ నువ్వు ఎక్కడవుంటావో అవధాన్లుకు తెలియదట..." అంటూ ఆవిడొక ఉత్తరం తెచ్చి నా చేతిలో పెట్టింది.

"వచ్చావా నేస్తం! బహుశా ఈ సరికి కాలేజిలు ఓపెన్ చేసివుంటారు. పాసయావా? పాసయేవుంటావులే నాకు తెలుసుగదా... మిగిలిన ఉత్తరం రాయబోయేముందర స్నేహితుడా! నన్ను క్షమించమని ప్రార్థిస్తున్నాను. చనిపోయినవాళ్లపైన కోపం తెచ్చుకోగూడదని నువ్వే చెప్పేవాడివిగదా! అందుకని నామీద కోపం తెచ్చుకోవని అనుకుంటూ రాస్తున్నాను.

ఈ ప్రపంచంలో నేను అనేకమైన ఆశలుపెట్టుకొని తిరిగాను. వందేళ్లా అందంగా ఆనందంగా బ్రతికేస్తాననే కలలుగన్నాను. మా అమ్మ నన్ను చాలా కష్టాలుపడి పెంచింది. ఆవిడకోసం ఎన్నెన్నో చెయ్యాలనుకున్నాను. పెద్ద ఉద్యోగస్తుడినయి ఆవిడని కార్లలో తిప్పాలనుకున్నాను. కానీ, ఒక రెండు సంవత్సరాలక్రితం తెలిసింది, నా నోట్లోనుంచి వచ్చిన నెత్తురు మృత్యువు నుంచి వచ్చిన మొదటి పిలుపులని. భగవంతుడుగూడా విచిత్రంగానే చేస్తాడు. బీదవాళ్లకే ఎందుకో అతి ఖరీదయిన రోగాలనందిస్తాడు!

నేస్తం! నిజం చెప్పాలంటే నీ పరిచయం మోడైపోతున్న నా జీవితంలో ఒక చిన్న ఆశని కలిగించింది. మరణంలో నీ స్నేహం బహుశా చివరి మజిలీ అనుకుంటాను. నిజంగా ఎంత ఆప్యాయతని అందించావు... ఎంత స్వాంతన కలిగించావు... నిజానికి నేను మిత్రద్రోహిని, నా రోగం విషయం నీదగ్గర దాచాను. కానీ, అందులో నా స్వార్థం వుంది. చనిపోతున్న విషయం నీకు తెలిస్తే నీ కళ్లలో ఇదివరకటి ఆప్యాయత బదులు సానుభూతి మిగులుతుంది. అది నాకిష్టంలేదు. చావు అనేది అందరికీ వస్తుంది. నాకు ఈ విధంగా రాబోతుంది. అందులో పెద్ద బాధపడాల్సిన అవసరమేముంది అనుకుని నీకు చెప్పలేదు.

కానీ, నువ్వెందుకు నాతో మాట్లాడటం మానేసావు? బ్రతికివుంటే నిన్ను అనేకసార్లు అడగాలనుకునీ అడగలేకపోయిన ప్రశ్నయిది. కానీ, ఇప్పుడయినా మాట్లాడతావా! ఎందుకంటే నాకంటూ ఉన్న ఒకేఒక్క స్నేహితుడివినువ్వు. నా కవితలు వినేవాడివి, నాతోపాటు పాడేవాడివి. నా కష్టాలు నిన్ను పంచుకోనివ్వలేదు కానీ మనం ఎంతదగ్గరగా బ్రతికాము... అది చాలదూ నా చిన్ని జీవితానికి ఒక గుర్తుగా మిగలడానికి. పైగా నువ్వు నాకు బాకీపడ్డాననుకునేవాడివిగదా! అది నేను కట్టాలనుకున్న పరీక్షఫీజు ఎలాగూ చనిపోయేవాడికి పరీక్షలేమిటి! నువ్వు చదివి పెద్ద ఆఫీసరువయితే నాకు అదన్నా తృప్తిగా మిగులుతుంది.

నేస్తం! ఆఖరుకోరిక ఒకటి కోరతాను తీరుస్తావా? బహుశా స్నేహాన్ని స్వార్థానికి వాడుకుంటున్నానేమో నని సిగ్గుగావుంది, కానీ అడగకుండా వుండలేను. నేను లేనని తెలిసినతర్వాత నా కన్నతల్లి గుండె చెరువయిపోతుంది. బ్రతుకంతా మోడుగా మారిన ఆవిడ జీవితానికి ఒకేఒక్క చిగురును నేను. నేనూ లేనని తెలిస్తే ఆవిడ ఏమయిపోతుంది. నేస్తం! దయచేసి ఆవిడని నీదగ్గరకి తీసుకో. నా కంటే వయసులో చిన్నవాడివే కాబట్టి తమ్ముడులేని లోటు తీర్చావనుకుంటాను. ఈ వయసులో ఆవిడకి రాగూడని కష్టం వచ్చింది. కానీ, నేనేం చేయగలను.

ఇక వస్తాను నేస్తం. వెలుగులాంటి జీవితానికి రోగం సంధ్యగా మారింది. మృత్యువనే చీకటి నా చిన్ని ప్రపంచాన్ని కప్పెయ్యబోతుంది. చావంటే భయపడటంలేదు. బహుశా ఈ మజిలీలో భగవంతుడిని కలుస్తానేమో. కలిస్తే మాత్రం ఖచ్చితంగా నిలదీస్తాను. అందరినీ కన్నతండ్రే అయితే అందరినీ సమానంగా ఎందుకు చూడడని ఎప్పట్నించో అడగాలనివుంది. చనిపోయేవాడికి ఆశలను పోసి ఆడుకునే కసాయివాడు దేవుడెలా అయ్యాడని ప్రశ్నించాలనివుంది. వీలయితే ఇంకొక జన్మ జీవించాలనివుంది. నీతో అన్నీ మాట్లాడుతూ నీస్నేహితుడిగా మళ్లీ బ్రతకాలనివుంది..."

*****

"తాతయ్యా.. తాతయ్యా.." నా మనవడు శంకరం కుదపడంతో ఆలోచనల్లోంచి బైటపడ్డాను. నా కళ్లలోంచి కన్నీరు బుగ్గలపై జారడంతో కండువాతో తుడుచుకోబోయాను. ఈ విషయం చూసాడల్లేవుంది

"అమ్మా! తాతయ్యేడుస్తున్నాడేవ్" అంటూ వంటింట్లోకి పరిగెత్తాడు నా చిన్ని శంకరం.

END

## Lotus: An Award for Excellence in Creating Computing

Lotus, the Hindu icon standing for creative power in the Universe, the source from which the creator Brahma Himself emerged, the seat of Saraswathi - the goddess of wisdom, is the name chosen for an award for Excellence in Creative Computing. ***This (yearly) award is given to youth from India living in the North American Continent to encourage children and youth to experiment with computers and to promote, recognize and honor their talent in the creative applications(s) of computers***. The Lotus Award is organized and administered by a group of professors and professionals in computing, electrical engineering and creative arts.

***Youth 18 years or younger*** are invited to participate in a contest that results in the naming of the "Top 20" entries who, in turn, will compete in a face to face final round on ***July 3, 1997.*** For this year, our plans are to conduct the final round of the competition in conjunction with the TANA Conference to be held in Anaheim during ***July 3-6, 1997.***

A distinguished panel of judges will pick the ***Grand Prize winner and five Honorable Mention citations***. This year, the ***Lotus Award winner will receive an Apple Multimedia Computer System, a software bundle and a citation.*** Depending on the level of participation and quality of entries, other prizes may be instituted.

***Contestants*** should submit an Entry Form and a ***$30 non-refundable Entry Fee*** by ***April 1, 1997.*** Final projects are due by ***May 1, 1997. For full contest rules***, entry form and other further information, please see:
***http://www-ksl.stanford.edu/people/vemuri/lotus/***
or send a e mail request to ***lotus@cs.stanford.edu*** or a self-addressed stamped envelope to: ***Prof. V. Rao Vemuri, Dept. of Applied Science, P.O. Box 808, L-894, University of California, Davis, Livermore, CA 94550.***